సాక్షి అనకాపల్లి

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



అనంతుని దీపోత్సవం

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండువగా జరగనుంది.



ఐఎన్ఎస్ వార్షికోత్సవం

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్ 333 ఈగల్స్ హెలికాప్టర్ 43వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.



ఐఐఎంవీతో సిడ్బీ ఎంవోయూ

విశాఖ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నంతో సిడ్బీ అవగాహన ఒప్పందం చేసుకుంది.

న్యూస్‌రీల్

15 నుంచి నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

అనకాపల్లిటౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా మిషన్(సీడప్)లో భాగంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిరుద్యోగ యువతకు ఈ నెల 15 నుంచి నాలుగు మాసాలపాటు వివిధ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారిణి కె.కల్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, శిక్షణ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 89785 33105, 70132 28982 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

వడ్డాది వంతెనపై రాకపోకల పునరుద్ధరణ



వడ్డాది వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది వంతెనపై రాకపోకలను సోమవారం నుంచి పునరుద్ధరించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలకు పెద్దేరు నది ఉధృతంగా ప్రవహించడంతో ఈ నెల 5వ తేదీన ఇక్కడ వంతెన దెబ్బతింది. డైవర్షన్ రోడ్డు పూర్తిగా మునిగిపోగా, వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖపట్నం, పాడేరు, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వెంటనే మరమ్మతులు చేపట్టి రవాణా సదుపాయం కల్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన రాళ్లు, గ్రావెల్ వేసి తాత్కాలికంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లేలా రవాణా సదుపాయం కల్పించారు. రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి బస్సులు, లారీలు వెళ్లేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సీఐఐ యంగ్ ఇండియన్స్ చైర్మన్‌గా హర్షనందన్

బీచ్‌రోడ్డు: సీఐఐ యంగ్ ఇండియన్స్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్‌గా హర్ష నందన్, కో చైర్‌పర్సన్‌గా శ్రావణి సంధ్య ఎంపికయ్యారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం చాప్టర్ 15వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐఐ విశాఖపట్నం చైర్మన్ డాక్టర్ పీపీ లాల్ కృష్ణ వీరు ఎంపికైనట్లు ప్రకటించారు. హర్షనందన్ వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్నారు. శ్రావణి ఔరా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ వ్యవస్థాపకురాలు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

- నేడు చోడవరం నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్ర
- రోలుగుంట నుంచి భారీ ర్యాలీ.. వడ్డాదిలో బహిరంగ సభ
- పాల్గొననున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు



వేదికను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ, అధికారులు

సామాజిక స్వప్నం.. సాకారమైన తరుణం..



వడ్డాదిలో సిద్ధమవుతున్న బహిరంగ సభ ప్రాంగణం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం చోడవరం నియోజకవర్గంలో జరగనుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకూ 55 నెలల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. దేశంలో మరెక్కడా లేనివిధంగా బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ.. గత ప్రభుత్వం సామాజిక న్యాయం, రాజ్యాధికారం వంటి మాటలు చెప్పి ఎలా మోసం చేసిందో వివరిస్తారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో రెండు విడతల్లో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. అనకాపల్లి జిల్లాలో మొదటి విడతలో మాడుగుల, అనకాపల్లి, రెండో విడతలో యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించారు. **ఆదేతరహాలో మంగళవారం ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ** ఆధ్వర్యంలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను పార్టీ శ్రేణులు, యువత రెట్టింపు ఉత్సాహంతో జయభేరి మోగించనున్నారు. ఈ యాత్రకు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రులు కె.నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, గుడివాడ అమర్‌నాథ్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర హాజరుకానున్నారు. సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్సీ, బస్సు యాత్ర ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, రాష్ట్ర నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, నియోకజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావులు పరిశీలించారు.



రావికమతంలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

యాత్ర సాగేదిలా..

- ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు రోలుగుంటలో మంత్రుల ప్రెస్‌మీట్
- 10.45 గంటలకు మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్న మంత్రులు, వైవీ సుబ్బారెడ్డి
- 11 గంటలకు రోలుగుంట నుంచి సామాజిక సాధికార బస్సుయాత్ర ప్రారంభం
- 12 నుంచి 12.20 గంటల వరకు రావికమతం మండలంలో గల ఎన్‌సీసీలో నాడు–నేడు పనుల పరిశీలన
- దొండపూడి, మేడివాడ, రావికమతం మీదుగా కోమలపూడి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ 1.15 గంటల నుంచి 2 గంటల వరకు లంచ్ బ్రేక్
- 2.20 గంటలకు ఎల్.బి.పి.అగ్రహారంలో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభోత్సవం
- 2.30 గంటలకు బుచ్చియ్యపేట మండలంలో వడ్డాది గ్రామంలో గల బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు
- 2.45 గంటల నుంచి 4 గంటల వరకూ భారీ బహిరంగ సభ

బడుగులకు ప్రాధాన్యం లభించిందిలా..

చోడవరం నియోజకవర్గంలో బలహీన వర్గాలకు నామినేటెడ్, రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం లభించింది. బీసీలకు డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర బీసీ సెల్ డైరెక్టర్, జంగం కార్పొరేషన్, తెలుకుల కార్పొరేషన్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్, రైల్వే బోర్డు మెంబర్, మార్కెట్ కమిటీ చైర్మన్, సింహాచలం దేవస్థానం డైరెక్టర్, ఎస్సీలకు టెలికాం బోర్డు మెంబర్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పదవులు కేటాయించారు. **రాజకీయంగా బీసీలకు మూడు జెడ్పీటీసీ, మూడు ఎంపీపీ, ఐదు వైస్ ఎంపీపీ స్థానాలు, ఎస్సీకు ఒక** ఎంపీపీ అందించారు. వడ్డాది మేజర్ పంచాయతీ సర్పంచ్ జనరల్ స్థానమైనా బీసీ గవరకు ఇచ్చారు. నియోజకవర్గంలో 55 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.980 కోట్ల సంక్షేమం, రూ.900 కోట్లతో అభివృద్ధి చేశారు. రూ.150 కోట్లతో జలజీవన్ మిషన్, రూ.128 కోట్లతో ఏడీబీ రోడ్లు, రూ.88 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు, రూ.100 కోట్లతో పీఆర్ రోడ్లు, రూ.18 కోట్ల పంచాయతీ గ్రాంట్లు, రూ.100 కోట్లతో సచివాలయ, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల ఆధునికీకరణ, రూ.50 కోట్లతో నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, రూ.80 కోట్లు సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేశారు.

సాధ్యమయిన సామాజిక సాధికారత



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు, కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలందించారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యం కల్పించారు. అందుకే అందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చోడవరం నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగింది. సాకారమైన సామాజిక సాధికారతను వివరించడానికే బస్సు యాత్ర చేపట్టాం.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

శారదానదిపై వంతెన నిర్మాణానికి ఎంపీ వినతి



ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: కశింకోట మండలం వెదురుపర్తి గ్రామం వద్ద శారదానదిపై కాలి నడక వంతెన నిర్మాణం చేపట్టాలని పార్లమెంట్ సమావేశంలో సోమవారం పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను ఎంపీ బీవీ సత్యవతి కోరారు. వెదురుపర్తి గ్రామానికి చెందిన పాడి పశువులు, పలువురు రైతులు తమ దైనందిన కార్యకలాపాలకు శారదానది దాటాల్సి ఉంటుందని, వర్షాలు పడినప్పుడల్లా నది పొంగి, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు వంతెనతోనే ముగింపు పడుతుందన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

తండ్రిని హతమార్చిన వ్యక్తికి జీవిత ఖైదు

విశాఖ లీగల్: మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదన్న నెపంతో కన్న తండ్రిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి పాపారావు అందించిన వివరాలు.. నాతవరం మండలం నగరం గ్రామానికి చెందిన నిందితుడు కదిరి సత్తిబాబు (37) మద్యానికి బానిస. ప్రతి నెల తండ్రి అప్పన్న (67)కి వచ్చే వృద్ధాప్య పింఛను సొమ్ము తీసుకెళ్లి తాగడం అలవాటు. గత ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన పెన్షన్ డబ్బులు ఇవ్వాలని ఇంట్లో గొడవ చేశాడు. అందుకు తండ్రి నిరాకరించడంతో దగ్గరలోని కర్రతో అప్పన్నను బలంగా గాయపరిచాడు. తీవ్ర గాయాల మధ్య అప్పన్న మృతి చెందాడు. నర్సీపట్నం రూరల్ పోలీస్ అధికారి కె.శ్రీనివాసరావు ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు.

13న డీఫార్మసీ స్పాట్ ప్రవేశాలు

మురళీనగర్: నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డీ-ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు ఈనెల 13న నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ కోర్సులు చేసిన విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా నేరుగా కాలేజీ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముడసర్లోవలో జీవీఎంసీ హెడ్ క్వార్టర్

- సాగర్‌నగర్‌లో ఎకో ఫ్రెండ్లీ తాబేలు బీచ్
- జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆమోదముద్ర



మాట్లాడుతున్న మేయర్

డాబాగార్డెన్స్ (విశాఖ): ముడసర్లోవలో 4.37 ఎకరాల్లో జీవీఎంసీ నూతన ప్రధాన కార్యాలయం (హెడ్ క్వార్టర్ బిల్డింగ్) నిర్మాణానికి కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో 18 అంశాలు, 27 సప్లిమెంటరీ అంశాలతో పాటు 8 టేబుల్ అంశాలు.. మొత్తంగా 53 అంశాలు సభ్యుల ముందుకు చర్చకు వచ్చాయి.

రూ.99.47 కోట్లతో కార్యాలయం

ముడసర్లోవలో రూ.99.47 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఎన్‌బీసీ, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణపు మార్గదర్శకాలకు అనుగుణంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నిర్మిస్తామని కమిషనర్ సాయికాంత్ వర్మ చెప్పారు. ప్రతిపాదిత జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్ సప్లై కంపెనీ(విస్కో) రూ.80 కోట్లు కేటాయిస్తూ.. ఆ సంస్థ బోర్డు సమావేశంలో తీర్మానం చేసిందన్నారు. మిగిలిన బడ్జెట్ రూ.19.47 కోట్లు జీవీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి వినియోగిస్తామని వెల్లడించారు. ఈ అంశాన్ని కౌన్సిల్ ఆమోదించడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కమిషనర్ వివరించారు.

సాగర్‌నగర్‌లో ఎకో ఫ్రెండ్లీ తాబేలు బీచ్

సాగర్‌నగర్‌కు ఎదురుగా తీరంలో రూ.15.65 కోట్లతో 'ఎకో ఫ్రెండ్లీ తాబేలు బీచ్' ఏర్పాటుకు సభ్యులు ఆమోదం తెలిపారు. విశాఖ మహానగరానికి ఈ బీచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని కమిషనర్ చెప్పారు. బీచ్ టూరిజంను ప్రోత్సహించడానికి, సముద్ర పర్యావరణ జీవితం, ఆలీవ్ రిడ్లే తాబేళ్ల గురించి ఈ బీచ్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు.

లా నేస్తం నిధులు రూ.18.90 లక్షలు అందజేత



నమూనా చెక్కును అందిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

తుమ్మపాల: జిల్లాలోని 63 మంది యువ లాయర్లకి వైఎస్సార్ లా నేస్తం 6 నెలల నిధులు రూ.18.90 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె లా నేస్తం నమూనా చెక్కును యువ లాయర్లకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన వారు వృత్తిలో స్థిరపడే వరకు మొదటి మూడేళ్లపాటు నెలకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. ఇది జూనియర్ లాయర్లకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా జగనన్న లా నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ జాహ్నవి పాల్గొన్నారు. లా నేస్తం లబ్ధిదారుల్లో 43 మంది బీసీ, 13 మంది ఓసీ, ఆరుగురు ఎస్సీ, ఒకరు ఎస్టీ కేటగిరీకి చెందినవారున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహసత్యవతి, డీఆర్డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, యువ లాయర్లు పాల్గొన్నారు.

నేతన్నకు జగనన్నే నేస్తం

నేతన్నల తలరాతలు పూర్తిగా మారిపోయాయి. మగ్గాలకు మహర్దశ వచ్చింది. జగనన్నే నేతన్నకు నిజమైన నేస్తమయ్యాడు. ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు చతికిలపడ్డ నేతన్నకు ఊతమిచ్చి తిరిగి మగ్గం బాటపట్టేలా జగనన్న చర్యలు చేపట్టారు. పొట్టకూటి కోసం కూలిబాట పట్టిన నేతన్న, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో మగ్గానికి చేరువయ్యాడు.

- ప్రభుత్వ సాయంతో మగ్గం బాట పట్టిన కార్మికులు
- ఏడాదికి రూ.24 వేలు ఒకే విడతలో జమ
- ఐదేళ్లలో ఒక్కో నేతన్నకు రూ.1.20 లక్షల సాయం



నక్కపల్లిలో వస్త్రాలు నేస్తున్న నేతన్నలు



వస్త్రాల తయారీలో నేతన్నలు

నక్కపల్లి: గత ప్రభుత్వాల హయాంలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యమయింది. నేతన్న కులవృత్తికి దూరమై, కూలి పనులకు వలసపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూలు ధర పెరిగిపోవడం, ప్రభుత్వం నుంచి నూలు కొనుగోలుకు రాయితీ ఇవ్వకపోవడం, రుణ సదుపాయం లేకపోవడంతో మగ్గం భారమైన స్థానిక నేతన్నలు నక్కపల్లి, పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు, ఇతర వ్యవసాయ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రజాసంకల్ప యాత్రలో నేతన్నల సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే చేనేతకు పూర్వ వైభవం తీసుకు వస్తామన్నారు. నేతన్నలకు ప్రతి నెలా రూ.2 వేలు చొప్పున ఏడాదికి ఒకేసారి రూ.24 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నేతన్న నేస్తం పథకం ద్వారా ఈ నగదు సాయాన్ని నేరుగా నేతన్నల ఖాతాల్లోనే జమ చేయడంతో, చేనేతకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. కరోనా సమయంలో కూడా ఇబ్బంది లేకుండా ఐదేళ్లపాటు నిరాటంకంగా నేతన్న నేస్తం పథకం అమలు చేశారు.

జిల్లాలో మొత్తం చేనేత సంఘాలు	17
జిల్లాలో చేనేత కుటుంబాలు	250
పాయకరావుపేట, నక్కపల్లిలో చేనేత కుటుంబాలు	120
ఒక్కొక్కరికి ఏడాదికి లబ్ధి	రూ.24 వేలు
ఐదేళ్లలో ఒక లబ్ధిదారుడు అందుకున్న మొత్తం	రూ.1.20 లక్షలు

ఇంటి వద్దే ఉపాధి



రెండు రోజుల పాటు భార్యభర్తలిరువురం కష్టపడి ఒక చీర నేస్తే వచ్చే కూలి రూ.500లు. అదే బయట పనులకు పోతే రూ.1500లు సంపాదిస్తాం. కులవృత్తిని వదులుకోలేకపోతున్నాం. మా బాధలు చూసే దేవుడు జగన్ రూపంలో వచ్చాడన్న ఆనందం కలిగింది. జగనన్న ఇస్తున్న నేతన్న నేస్తం నిధులతో ఇంటిపట్టునే కులవృత్తి చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాం.

– గుడ్డటి లక్ష్మి, నేత కార్మికురాలు

గౌరవంగా జీవిస్తున్నాం



పెట్టుబడులు పెరిగి, నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కుల వృత్తికి దూరమై కూలిపనులకు వెళ్లేవాళ్లం. జగనన్న దేవుడు రూపంలో వచ్చాడు. మాలాంటి నేత కార్మికులను ఆదుకుని కులవృత్తికి దగ్గర చేశాడు. ఐదేళ్లలో రూ.1.20 లక్షలు మా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి.

– కల్లూరి మంగ, నేత కార్మికురాలు

కులవృత్తికి జీవం పోసిన నేత



నేత కార్మికులను ఆదుకుని కులవృత్తిని కాపాడిన నాయకుడు జగనన్న. వలసపోయిన నేతన్నలను తిరిగి మగ్గం బాట పట్టేలా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు హయాంలో చేనేత రంగం నిర్వీర్యమయింది. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి.

– గిడుతూరి నాగబాబు, శ్రీరంగ చేనేత సొసైటీ అధ్యక్షుడు

కరాటే పోటీల్లో 'బంగారు' విజేతలు

కశింకోట: కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ సత్తా చాటి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. సామర్లకోటలో ఇటీవల విక్టరీ సోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆహ్వానపు జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించింది. పోటీలో పాల్గొన్న ఈ స్కూలు విద్యార్థులు పదేళ్లలోపు కాటా విభాగంలో కె. ఫణీష్ సహా 13 ఏళ్లలోపు టీం కాటా విభాగంలో వై.ఆసీస్ అరవింద్, వై.పి.వి.బి ప్రణీత్ సాయి, కె.అలెన్ జోసెఫ్ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని అకాడమి ఇన్‌ఛార్జి సిహెచ్. చంద్రమౌళి, ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు.

కోనాం అక్విడెక్ట్‌ను పరిశీలించిన ఎస్ఈ

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం పరిధిలోని మార్లగుమ్మి కాలువలో దోకల వారి కళ్లాలు వద్ద కూలిపోయిన అక్విడెక్ట్‌ను ఇరిగేషన్ విశాఖ సర్కిల్ ఎస్ఈ కె.సూర్యకుమార్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఏడాది క్రితం వర్షాలకు ఈ అక్విడెక్ట్ కూలిపోయింది. దీన్ని పరిశీలించిన ఎస్ఈ త్వరలోనే అక్విడెక్ట్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ఆయన వెంట ఏఈ జయరాం ఉన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

తుమ్మపాల : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జేసీ జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 338 మంది అర్జీలు రాగా ఎక్కువగా భూ సమస్యలు, రేషన్‌కార్డుల దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు ఆమె చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఆర్వో బి.దయానిధి, ఎస్‌డీసీ ఎ.మహేష్, డీఆర్‌డీఏ పీడీ ఇ.సందీప్‌లు అర్జీలు స్వీకరించారు.

భూ ఆక్రమణదారుల నుంచి కాపాడరూ...

సబ్బవరం మండలం నల్లరేగుల పాలెం గ్రామంలో సర్వే నెం.110-2 లో ఉన్న మూడెకరాల భూమిని ఆక్రమించి దొంగ రిజిస్ట్రేషన్లతో విక్రయించేస్తున్న కొందరు రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజాన సన్యాసిరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. తన తండ్రి ద్వారా వారసత్వంగా వస్తున్న భూమిని కబ్జా చేయడంపై ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారని, తప్పుడు దస్తావేజులతో విక్రయాలు చేస్తున్నారని, ఆక్రమణదారుల నుంచి తమకు రక్షణ కల్పించి, తమ భూమిని కాపాడాలని కోరారు.

డీ పట్టా మంజూరు కోరుతూ....

తాము సాగు చేసుకుంటున్న భూములకు డీ పట్టాలు మంజూరు చేయాలని మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామాలనికి చెందిన దళిత మహిళలు కోరారు. సర్వే నం


స్పందన అర్జీలను స్వీకరిస్తున్న జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

.737 ప్రభుత్వ భూమిని తాము సాగుచేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు గర్తించారని, గతంలో అనేకసార్లు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మొక్కలు, ఎరువులు, బోర్లు, రుణాలు ఇచ్చారని తెలిపారు. 2008 ఏడాదిలో అప్పటి రెవెన్యూ అధికారులు తమకు డీ-పట్టాలు మంజూరు చేయవచ్చని ప్రభుత్వానికి నివేదిక కూడా అందించారన్నారు. రీసర్వే ద్వారా తమ భూములకు డీ-పట్టాలు మంజూరు చేయాలని స్పందనలో కోరారు.

పింఛను మంజూరు చేయాలి..

వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరుతూ అచ్చుతాపురం మండలం చూచుకొండ గ్రామానికి చెందిన కోడెల నాగేశ్వరరావు స్పందనలో అర్జీ చేసుకున్నారు. మూడేళ్ల క్రితమే తనకు 60 ఏళ్ల వయస్సు దాటిందని, వేలిముద్ర పడని కారణంగా పింఛను మంజూరు చేయడం లేదని తెలిపారు.

డిస్ ప్లే బోర్డులు పెట్టండి..

జిల్లా అభివృద్ధిలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలిపేలా పనులు జరుగుతున్న చోట్ల కాంట్రాక్టర్లు డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. జిల్లాలో అనేక చోట్ల పనులు జరుగుతున్నాయని, వాటికి ఖర్చు చేస్తున్న నిధులు, ప్రణాళిక వంటి అంశాలు తెలియక ప్రజలు అస్పష్టతకు గురవుతున్నారన్నారు.

338 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో జరిగిన స్పందనకు మొత్తం 338 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు ఉన్నాయి. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డీఆర్ఓ బి.దయానిధి, ఎస్‌డిసి డాక్టర్ ఎ.మహేష్, డీఆర్‌డీఏ పీడీ ఈ.సందీప్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 36 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు

అనకాపల్లిటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమ వారం స్పందనకు 36 అర్జీలు వచ్చాయి. క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీటింగ్, భూ తగాదాలు, కుటుంబ కలహాలు వాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో భాగస్వాములు కండి


సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్: ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆపార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం క్రీడాకారుల్లో ప్రతిభన వెలికితీసేందుకు ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు.

కవి లక్ష్మణరావుకు జాతీయ పురస్కారం



రావికమతం: టి.అర్జాపురానికి చెందిన కవి గుంటూరు లక్ష్మణరావుకు మధుర కవి విభూషణ జాతీయ పురస్కా రం లభించింది. తెలంగాణకు చెందిన మేఘన సాహితీ కళా వేదిక వారు మాత్రా ఛందస్సులో ప్రాస నియమంతో కూడిన 500 మధురిమలు, కవితలు రాసిన వారిని పురస్కారానికి ఎంపిక చేశారు. లక్ష్మణరావుకు సోమవారం పురస్కారం ప్రదానం చేశారు. ఈయన సామాజిక చైతన్యం కలిగించే రచనలు చేసి కవీశ్వర, కథా విశారద, పుడమి రత్న అవార్డులు పొందారు.

లోకేష్‌కు ఉత్తరాంధ్రలో ప్రవేశించే అర్హత లేదు

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ



నక్కపల్లి: కార్యనిర్వాహక రాజధానిగా విశాఖను వ్యతిరేకించిన టీడీపీ నేత నారా లోకేష్‌కు ఉత్తరాంధ్రలో పాదయాత్ర చేయడానికి సిగ్గులేదా? ఏ ముఖం పెట్టుకుని విశాఖ జిల్లాలో అడుగుపెడుతున్నారని రాష్ట్ర ఎస్సీ(మాల) కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ ఆక్షేపించారు. సోమవారం ఆమె అడ్డురోడ్డులోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ముందు ఉత్తరాంధ్ర ప్రజలకు లోకేష్ క్షమాపణ చెప్పిన తర్వాత పాదయాత్ర ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న లోకేష్‌కు స్వాగతం పలకడానికి వెళ్లిన ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులకు సిగ్గులేదన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రమంతా అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆలోచిస్తుంటే, టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోకేష్ చేసేది పాదయాత్ర కాదని, కేవలం ఉప్పులేని పప్పు మాదిరిగా తయారయిందని ఎద్దేవా చేశారు. ప్రారంభంలో ప్రకటించిన పాదయాత్రకు ఇప్పుడు చేస్తున్న యాత్రకు సంబంధం లేదన్నారు. యాత్రను కుదించుకుని తొందరగా ముగించేస్తున్నారని విమర్శించారు. ఎక్కడ ఇడ్లీలు బొండాలు బాగుంటాయో తెలుసుకుని ఆ ప్రాంతంలో పాదయాత్ర ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఎన్ని యాత్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో నీ బాబు, నువ్వు ఓడిపోవడం ఖాయమన్నారు.

డీఈవోకు యూటీఎఫ్ వినతి


డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లిటౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించాలని యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్, బదిలీలు, పీఎఫ్ అకౌంట్లు, డిప్యూటీ డీఈవో, అర్బన్ ఎంఈవో పోస్టుల భర్తీ సమస్యలపై ఈనెల 15న ధర్నా చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షులు పి.గాయత్రి, మండల ప్రధాన కార్యదర్శి సిరసపల్లి శ్రీను, మండల అధ్యక్షుడు మామిడి బాబూరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో దొండా కుసుమ

అనకాపల్లిటౌన్ : సబ్‌జూనియర్, జూనియర్, ఓపెన్ (సీనియర్), మాస్టర్స్ ఏసియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు పట్టణానికి చెందిన దొండా కుసుమ మహిళల 63 కేజీల విభాగంలో ఎంపికైనట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పట్టణ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు మలేషియా దేశం జోహర్‌బర్గులో జరిగే పోటీల్లో ఈమె పాల్గొనడం అభినందనీయమని అన్నారు. గతంలో ఈమె మంగోలియాలో జరిగిన ఆసియా పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించడంతో ఇటీవల రాష్ట మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్రీడాకారిణి కుసుమను అభినందించారన్నారు.

ఐక్యతకు ప్రతీకలు కార్తీక వనసమారాధనలు


కోరాకుల కల్లాలు వద్ద కార్తీక వన సమారాధనలో డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న మహిళలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : గ్రామాల్లో ప్రజలంతా ఐక్యంగా కార్తీక వనసమారాధనలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. కార్తీకమాసం నాలుగో సోమవారంను పురస్కరించుకొని తిమిరాం ఉమా మహేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని పూజులు చేశారు. ఎ. కొత్తపల్లిలో వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధనలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. వన సమారాధనలో భక్తులకు ఆయన స్వయంగా వడ్డన చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబురావు, ఉప సర్పంచ్ సరువునాయుడు, గౌరీ పరమేశ్వర్ల యూత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దేవరాపల్లిలో కాయగూరల మార్కెట్ వ్యాపారులు, కోరాకుల కల్లాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనల్లో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. స్థానికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం స్థానిక మహిళలు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర రావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వి. సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెండాలే తప్ప జనాలేరీ?

- పేలవంగా లోకేష్ పాదయాత్ర
- తొలిరోజు స్పందన అంతంతమాత్రమే
- అనితకు వ్యతిరేకంగా నిరసన గళం


పూలమాలలకు నోచుకోని ఎన్టీఆర్ విగ్రహం


పాయకరావుపేటలో లోకేష్ పాదయాత్ర

నక్కపల్లి/పాయకరావుపేట: జెండాల హడావుడే గానీ జనం సందడి లేని నారా లోకేష్ పాదయాత్ర జిల్లాలో పేలవంగా ప్రారంభమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన 'యువగళం' తొలిరోజు చప్పగా సాగింది. జేజేలు పలకాల్సిన పార్టీ శ్రేణులు నిరసన గళానికే ప్రాధాన్యమిచ్చాయి. తుని పర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో లోకేష్ పాయకరావుపేటలోకి అడుగుపెట్టారు. గౌతం సెంటరు వద్ద మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తన అనుయాయులతో స్వాగతం పలికారు. జనం ఆసక్తి చూపకపోయినా.. అదే సమయానికి సినిమాహాళ్ల నుంచి బయటకు వచ్చినవారు, భవన నిర్మాణ పనులకు వెళ్లిన కార్మికులు, విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే ఉద్యోగులు కనిపించడంతో పార్టీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. మెయిన్‌రోడ్డులో పార్టీ ఫ్లెక్సీలు, జెండాలతో నింపేసినా తెలుగు తమ్ముళ్ల జాడ అంతంతమాత్రంగానే ఉంది. పాయకరావుపేటలో అనిత వ్యతిరేక, అనుకూల వర్గాలు ఎవరికి వారు వేర్వేరుగా లోకేష్‌కు స్వాగతం పలికేందుకు రావడం గమనార్హం. పాదయాత్రలో జనసేన కార్యకర్తలు పెద్దగా పాల్గొనలేదు. ఆ పార్టీ నాయకులు గెద్దం బుజ్జి, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి లోకేష్‌ను కలిశారు. ఈ పాదయాత్రలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధనాగజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తాతను మరచిన మనుమడు

లోకేష్ పాదయాత్ర గౌతం సెంటరు, మంగవరం రోడ్డు మీదుగా పాయకరావుపేట వై జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఉంది. ఈ విగ్రహం ముందు నుంచే లోకేష్ జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. తాత విగ్రహం ముందు నుంచి వెళ్లి కూడా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించకపోవడం పట్ల తెలుగు తమ్ముళ్లు విస్తుపోయారు. చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకుంటున్నారని, ఆయన పెట్టిన పార్టీ లాక్కుని పదవులు అనుభవిస్తూ కనీసం ఆయన విగ్రహానికి దండ వేయకపోవడమేంటని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనితకు అసమ్మతి సెగలు

యువగళం పాదయాత్రలో నియోజకవర్గంలో పార్టీ కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. నారా లోకేష్ సాక్షిగా మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు నిరసన సెగ తగిలింది. అనిత అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్లె రాజబాబు, మాజీ పట్టణ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు జీవీఆర్ నగర్ వద్ద ఉన్న వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద అనిత ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. లోకేష్ పాదయాత్ర అక్కడకు చేరుకోగానే అనిత వద్దు, టీడీపీ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ నినాదాలు గమనించిన అనిత వెంటనే అక్కడకు వచ్చి వారిని సముదాయించే ప్రయత్నం చేయగా 'మమ్మల్ని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయించారు. మేం చేసిన తప్పేంటి' అని నిలదీశారు. లోకేష్ వారిని సముదాయించి యాత్ర కొనసాగించారు. బైపాస్ జంక్షన్, ప్రకాష్ కళాశాల, పీఎల్‌పురం, సీతారాం పురం మీదుగా నామవరం చేరుకొని, అక్కడ ప్రైవేటు లేఅవుట్‌లో రాత్రి బస చేశారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పవన్ సత్తా

- ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న పంచాయతీ కార్యదర్శి
- ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత


ఫుట్‌బాల్ టీమ్ సభ్యులతో పవన్

దేవరాపల్లి : మండలంలోని ఎస్.జి. నగరం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న టి. పవన్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు పవన్‌కుమార్ రెండోసారి ఎంపికయ్యారు. 2021లో ఢిల్లీలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించిన పవన్ సత్తాచాటారు. ఈ ఏడాది కూడా న్యూఢిల్లీ మోడల్ టౌన్‌లోని చాట్రాసాల్ స్టేడియంలో ఈ నెల 15 నుండి 21 వరకు జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్- (2023-24)కు ఎంపికయ్యాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడలో సెలక్షన్స్ నిర్వహించి జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 20 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు. విశాఖ నుంచి పవన్‌కుమార్ ఎంపికయ్యారు.

8 ఏళ్ల ప్రాయం నుంచే.. : విశాఖపట్నం కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ సమీపంలోని ఏవీఎన్ కాలేజీ రోడ్ ప్రాంతానికి చెందిన తుపాకుల పవన్ 8 ఏళ్ల వయసు నుండే ఫుట్‌బాల్ ఆడడం ప్రారంభించాడు. ఫుట్‌బాల్ క్రీడపై తనకున్న ఆసక్తిని గమనించిన తండ్రి మల్లేశ్వరరావు ఫుట్ బాల్ కోచింగ్ ఇప్పించారు. దీంతో ఫుట్‌బాల్‌లో నైపుణ్యం కనబరిచి జాతీయ స్థాయిలో అండర్-14, అండర్-16 ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. గతంలో విశాఖలో జిల్లా లీగ్‌లో పాల్గొనడంతో పాటు ఎస్ఆర్‌కెఎఫ్‌సి క్లబ్ తరపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచాడు. రిలయన్స్ డిజిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డును సాధించాడు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో వివిధ వర్సిటీ టోర్నీల్లో పాల్గొని సత్తా చాటాడు.

ప్రతిష్టాత్మక టోర్నీల్లో ఆడడమే లక్ష్యం



ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సంతోష్ ట్రోఫీకి ఆడడమే నా జీవిత ఆశయం. చిన్నతనం నుంచి ఫుట్‌బాల్‌పై నాకున్న ఆసక్తిని మా నాన్న గుర్తించి కోచింగ్ ఇప్పించారు. అప్పటి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఫుట్‌బాట్ టోర్నమెంట్, ట్రోఫీలలో పాల్గొన్నాను. పలు యూనివర్శిటీల తరుపున సౌత్ జోన్‌కు ఆడాను. రెండోసారి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– టి.పవన్, ఎస్.జి.నగరం పంచాయతీ కార్యదర్శి, ఫుట్‌బాల్ క్రీడాకారుడు

22 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు


పట్టుబడిన గంజాయితో పోలీసులు

చీడికాడ: మండలంలోని బైలపూడిలో ఇద్దరి నిందితుల నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై రామారావు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన గుమ్మిడి పోతురాజు కళ్లాల వద్ద గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడి చేయగా, గుమ్మిడి పోతురాజు ఏలూరు జిల్లాకు చెందిన కసింశెట్టి శ్రీనివాసరావుకు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.24 వేలు విలువ గల 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

క్లుప్తంగా

14న కుసుమ హరనాథ్ జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం కోటవీధిలో శ్రీ కుసుమహరనాథ్ జయంతి వేడుకలు ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ ప్రచార కార్యదర్శి ఉమామహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు జాము నుంచి కుసుమహరనాథ్‌లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజనలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని సత్యనారాయణపురం–2 సచివాలయం పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధి సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

సేవాతత్పరుల అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్: వచ్చే ఏడాది జనవరి 14న డాక్టర్ కొణతాల రామలింగస్వామి అవార్డు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిస్వార్థంగా సమాజానికి సేవలు అందించే ఆరు గురికి ఈ పురస్కారాలు అందిస్తామన్నారు. ఔత్సాహికులు ఎవరైనా తాము చేసిన సేవా కార్యక్రమాల వివరాలను దరఖాస్తుతో జత చేసి డాక్టర్ కొణతాల రామలింగేశ్వర మెమోరియల్ ట్రస్ట్, డోర్ నెం.12–118, తిలక్‌మార్గ్, చిన్నబాబు కాలనీ, తుమ్మపాల పంచాయతీ, అనకాపల్లి చిరునామాకు పంపించాల్సిందిగా కోరారు. గత నాలుగేళ్లుగా అవార్డులు పంపిణీ చేస్తున్నామని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తులకు మాత్రమే ఈ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9246642308 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

బోసిపోయిన ఏలేరు కాలువ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఏలేరు కాలువ బోసిపోయింది. విశాఖ ప్రజలకు, స్టీల్ ప్లాంట్‌కు నీటిని తరలించే కాలువకు ఎగువ ప్రాంతంలో గండి పడటంతో నీటి సరఫరాను నిలిపి వేశారు. దీంతో ఎల్లప్పుడు నీటితో నిండుగా ప్రవహించే కాలువలో నీరు లేక వెలవెలబోతోంది. దీన్ని చూసి స్థానికులు విస్తుపోతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 2,140 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌రకం	4,180	4,570
మొదటి రకం	3,980	4,500
రెండో రకం	3,890	4,200
మూడోరకం	3,620	3,920

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్	: సత్యనారాయణస్క్రీన్–1
-------	: సత్యనారాయణస్క్రీన్–2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
కోటబొమ్మాళి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బీ పాజిటివ్–8 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పోషకాల గోరుముద్ద



కూండ్రం హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద తింటున్న విద్యార్థులు



విద్యార్థులకు వండి పెట్టిన బిర్యానీ, కోడిగుడ్డు కూర

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల నివారణతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చింది. కొరవడిన చిత్తశుద్ధి, పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులకు గతంలో సరైన ఆహారం అందేది కాదు. పాదయాత్రలో పేద విద్యార్థుల ఆకలిని గమనించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో మెనూ రూపొందించారు. విద్యార్థులకు మెనూ మేరకు పోషకాహారం అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

మండలంలో గోరుముద్ద వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	80
ప్రాథమికోన్నత పాఠశాలలు	08
ఉన్నత పాఠశాలలు	18
మొత్తం విద్యార్థులు	9964
మొత్తం ఏజెన్సీలు	106

రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మూడు రోజులు రాగి జావ, ఐదు రోజులు కోడిగుడ్డు

మెనూ ప్రకారం వంటలు.. చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



నవశకం ప్రగతి సంతకం

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని జగనన్న గోరుముద్ద పేరుతో ప్రభుత్వం అందిస్తోంది. టీడీపీ హయాంలో నాసిరకమైన వంటకాలతో అరకొరగా మధ్యాహ్న భోజనం పెట్టే వారు. దీన్ని తినేందుకు విద్యార్థులు పెద్దగా ఇష్టపడేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయి. విద్యా కమిటీ అభిప్రాయాలను సేకరించి, రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. రోజూ ఉపాధ్యాయులు ఆహార పదార్థాలను పరిశీలించాకే విద్యార్థులకు వడ్డిస్తున్నారు. గతంలో వారానికి మూడు సార్లు కోడి గుడ్లు అందించే వారు. చాలాసార్లు అవి చెడిపోయేవి. తినేందుకు విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వారంలో ఐదు సార్లు కోడిగుడ్లు అందిస్తోంది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లను అదే వారంలో ఉపయోగించేలా వాటిపై గుర్తులను వేస్తున్నారు. ఇలా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



కూండ్రం హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

జగనన్న గోరుముద్ద మెనూ

సోమవారం:	కారం పొంగల్, ఉడికించిన గుడ్డు
మంగళవారం:	పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం:	వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం:	నిమ్మకాయ పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం:	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం:	తీపి పొంగల్, పప్పు, రసం, రాగిజావ

రుచికరంగా వండుతున్నారు



నేను రోజూ మధ్యాహ్నం స్కూల్లో జగనన్న గోరుముద్ద తింటున్నా. వారానికి ఐదు రోజులు కోడి గుడ్లు ఇస్తున్నారు. రోజుకో వెరైటీ కూరతో భోజనం పెడుతున్నారు. గతంలో స్కూల్లో భోజనం తినాలనిపించేది కాదు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే బడిలోనే రుచిగా ఉంటోంది. శుభ్రతతో కూడిన పోషకాహారం అందించడంతో అందరం కలిసి తినగలుగుతున్నాం. చదువుకోవడానికి, తినడానికి ఎలాంటి ఇబ్బందుల్లేవు. మా అమ్మానాన్నలు కూడా సంతోషంగా బడికి పంపుతున్నారు.

– మజ్జి మమత, 10వ తరగతి

రాగి జావంటే ఇష్టం



వారంలో మూడు రోజులు ఇస్తున్న రాగిజావ అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్‌కు వచ్చిన వెంటనే ప్రార్థన తర్వాత రాగి జావ ఇస్తున్నారు. మేమంతా ఇష్టంగా తాగుతున్నాం. మా అమ్మ కూడా రాగిజావను వదలకుండా తాగేయాలని చెప్పింది. రాగి జావ బలాన్నిస్తుందని చెప్పింది. రోజు మార్చి రోజు చిక్కీ కూడా ఇస్తున్నారు. ఏ రోజు ఏ ఆహారం పెడతారో మా స్కూల్ కిచెన్ గోడపై రాసి ఉంది. రుచికరమైన వంటకాలను అందిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– యాదగిరి రిషిత, 4వ తరగతి

కడుపు నిండా తింటున్నాం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. గతంలో కంటే ఇప్పుడు ప్రతి రోజూ ముందుగా నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. మా స్కూల్లో ఒకరిద్దరు తప్ప అందరూ ఈ భోజనాన్నే ఇష్టంగా తింటున్నారు. రోజూ అన్నం, గుడ్డు, చిక్కీ ఇస్తున్నారు. దీంతో సాయంత్రం ఇంటికెళ్ళే వరకు ఆకలి తెలియట్లేదు. గతంలో కంటే ఇప్పుడు మాకు నచ్చేలా మధ్యాహ్న భోజనంలో ఎంతో మార్పు వచ్చింది. దీంతో అందరం కడుపునిండా తింటున్నాం.

– నమ్మి నంద కిషోర్, 9వ తరగతి

టైం ప్రకారం ఆహారం



మా బడిలో ఇటు చదువు, అటు ఆహారం టైం ప్రకారం జరుగుతున్నాయి. మధ్యాహ్న భోజనం కింద మాకు పెడుతున్న ఆహారంలో ఏయే పోషకాలున్నాయో పాఠ్యాంశాల ద్వారా తెలుసుకున్నాం. అప్పటి నుంచి ఇంకా ఆనందంగా తింటున్నాం. గతంలో ఉండే మెనూలో చాలా మార్పులు చేశారు. నిత్యం ఒకే ఆహారం కాకుండా మార్పులు చేయడంతో ఆహారం రుచిగా ఉంటోంది. మాలాంటి పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ మామకు ధన్యవాదాలు.

– కొప్పుల తేజసాయి, 6వ తరగతి

సీఎం జగన్ పాలనలో ప్రగతి పథంలో గ్రామాలు



అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్



నరసింగబిల్లిలో అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణలో నేతలు

అనకాపల్లిటౌన్: కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే కొలమానంగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం–1 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి అంటే ఏమిటో తెలియని మారుమూల గ్రామాలు సైతం తమ ప్రభుత్వంలో అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయన్నారు. పట్టణాలు, గ్రామాల్లో నూతన రహదారులు అద్దంలా మారాయన్నారు. గిరిగ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వంతోనే సాధ్యమైందని, మరింత అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. అంతకు ముందు సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో అర్హులైనవారికి రూ.16.86 కోట్ల మేర సంక్షేమ లబ్ధి కలిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల బ్రోచర్లను స్థానికులకు అందించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవింద, సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ జోగా నాగమణి, పార్టీ నేతలు ఈశ్వరరావు, పలకా సత్తిబాబు, నాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని జెట్టపురెడ్డితుని సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెట్టపురెడ్డితునిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.18 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా స్థానికులకు లబ్ధి కలిగిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, ఎంపీడీవో వీవీ రవికుమార్, సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ నాయకులు కోన నాగేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత పక్షోత్సవాలు



వెదురుపర్తి హైస్కూలులో పాటల రూపంలో గణిత భావనలు ఆలపిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో జాతీయ గణిత పక్షోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.హెచ్‌ఎం జీవీకే ఆచారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ మూర్తి, పీవీఎస్ఎన్ మూర్తి గణిత భావనలను పాటల రూపంలో విద్యార్థులకు నేర్పించి, పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలపై సుమారు 20 వరకు పాటలు పాడారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వై.విజయ్, బోయిన చిన్నారావు, విజయలక్ష్మి, ఎ.సోమరాజు, త్రివేణి పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ల పంపిణీ



రైతుకు టార్పాలిన్లు అందిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా నీట మునిగిన వరిచేల రైతులకు సుమారు రూ.లక్ష విలువైన టార్పాలిన్లను ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.రామ్మూర్తి సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శంకరం, తుమ్మపాల గ్రామాల పంట పొలాల్లో రైతులకు వీటిని అందించినట్లు పేర్కొన్నారు. పంట నష్టంపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు సమాచారం, ప్రభుత్వ సూచనల మేరకు రైతులు అప్రమత్తమయితే పంట నష్టం చాలా వరకు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.కిరణ్, కె.కృష్ణమోహన్, దేవరాజు, జిల్లా కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంతలో విక్రయానికి గొర్రె, మేక పిల్లలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతకు సోమవారం ఎక్కువగా గొర్రె, మేక పిల్లలు అమ్మకానికి వచ్చాయి. వీటిని పెంపకందారులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఒక్కో పిల్ల రూ.3 వేలు వరకు విక్రయాలు సాగాయి. పెద్ద సైజు గొర్రెలు, మేకలు కూడా ఎక్కువగానే అమ్మకానికి వచ్చాయి. సైజును బట్టి రూ.25 వేల వరకు అమ్మకాలు సాగాయి.

స్థిరంగా కూరగాయల ధరలు

సంతలో టమాటా ధర టోకుగా తగ్గింది. చిల్లర ధరలో మార్పులేదు. క్రేట్ టమాటా గత వారం రూ.800 ఉండగా ఈ వారం రూ.550కి తగ్గింది. చిల్లరగా కిలో రూ.40కి అమ్మకాలు జరిగాయి. మిగిలిన కూరగాయల ధరలు కూడా స్థిరంగా ఉన్నాయి. ఉల్లిపాయ రూ.50, బంగాళాదుంప రూ.30, కేరట్ రూ.60, వంకాయ, దొండకాయ రూ.80, చిక్కుడు రూ.100కు విక్రయాలు సాగాయి.

శివ శివ శంకర భక్తవశంకర

- ఘనంగా కార్తీక మాస చివరి సోమవారం పూజలు
- ఊరూ వాడా ఆలయాల్లో మార్మోగిన శివ పంచాక్షరి



చౌడేశ్వర సాంబశివుని ఆలయం వద్ద అన్న సమారాధనను ప్రారంభిస్తున్న రత్నాకర్



కశింకోటలోని శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



సత్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు



కాశీవిశ్వేశ్వరస్వామికి క్షీరాభిషేకంలో అర్చకుడు



సాధువుల గుడిలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న యువతి



భోగలింగేశ్వరస్వామికి అర్చకుల అభిషేకం



సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యవ్రతాల్లో భక్తులు



భోగలింగేశ్వరస్వామి ఆలయంలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు



దీపార్చనకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణం, మండలంలోని శివాలయాలు సోమవారం హర హర మహాదేవ శంభోశంకర, ఓం నమఃశివాయ నామస్మరణతో మారుమోగాయి. స్థానిక భోగలింగేశ్వరుడు, సాధువుల గుడి, కన్యకాపరమేశ్వరి, సిద్ధిలింగేశ్వరుడు, కాశీవిశ్వేశ్వరుడు, చౌడేశ్వరి సాంబశివుడు, ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని, పూజించారు. వేకువజామున శారదానదిలో మహిళా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి, నదిలో విడిచిపెట్టారు.

- గవరపాలెం కోటవీధిలో వేంచేసిన భోగలింగేశ్వర ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, గోపూజ, సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం ప్రధాన అర్చకులు నారాయణరావు, బుజ్జి, చిన్నలు నిర్వహించారు. 200 మంది దంపతులు హాజరయ్యారు. సర్వకామదాంబ, భోగలింగేశ్వరస్వామిల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది.
- పట్టణంలో పలు శివాలయాలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధనను ప్రారంభించారు. ఆలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, నుదురుపాటి తాతాజీ, తాటికొండ కాంబాబు, చౌడేశ్వరి సాంబశివుని ఆలయ కమిటీ సభ్యులు శాలువతో రత్నాకర్ దంపతులను సత్కరించారు.
- సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి, సత్యనారాయణస్వామి ఆలయ మండపంలో సామూహిక సత్యవ్రతాలు, కుంకుమార్చనలు జరిగాయి. ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబులు దర్శించుకున్నారు.
- నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధి షిర్డీ సాయిబాబా మందిరం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- మండలంలో బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మంచు శివలింగానికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆశ్రమంలో నిర్వహించిన మృత్యుంజయ హోమాన్ని గ్రామీణ సీఐ ఎ.రవికుమార్ నిర్వహించి, మధ్యాహ్నం అన్నసమారాధన ప్రారంభించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్, పాలకవర్గ సభ్యుడు కాండ్రేగుల రాము, ఈవో ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అన్నమయ్య వాగ్గేయ సంకీర్తన బృంద వ్యవస్థాపకుడు తిమ్మపాత్రుని చక్రవర్తి, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నర్సింగరావు, తాడి నాగలక్ష్మి, ముకుంద, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయంలో భారీ స్థాయిలో శివ దీపార్చన, మహా రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలు, విభూది, చందనం, సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ, ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి తమ కుటుంబాలతో మహిళలు ఎక్కువగా తరలి వచ్చి శివుని ఆకారం, శివ లింగం తదితర ఆకారాల్లో ప్రమిదల సాయంతో దీపాలు వెలిగించారు. ధ్వజస్తంభం, నందీశ్వరుల వద్ద ఆలయంపైన పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. బాణసంచా కాల్చారు. ఆకాశ దీపాలు వెలిగించారు.

- మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఎక్కువగా తరలి వచ్చి స్వామిని దర్శించి పూజలు చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సంకల్ప యాత్ర సభలో మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కశింకోట: ప్రధాని మోదీ పేదల సంక్షేమం కోసం, దేశ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. కశింకోట పంచాయతీలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాల గురించి ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కలిగించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఏవో ఎం.స్వప్న, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.